
# డేంజరస్ కర్వ్ ఎహెడ్



గుత్తుల భాస్కరరావు

సారథి స్టీరింగ్ రఘు కప్పజెప్పి పక్కన రిలాక్సయ్యాడు. రఘుకి టచ్ లేని రూటు కావడం వల్ల పట్టి పట్టి డ్రైవ్ చెయ్యాల్సి వచ్చింది. అవడానికి ట్రంక్ రోడ్డయినా అంతా గతుకుల దారి. గతుకులు దిగమింగుతూ అంబాసిడర్ ఊగుతూ తూగుతూ సాగుతూంది.

"ఈ రోడ్డు మలుపులమయంలా వుందే" అన్నాడు రఘు.

సారథి పాకెట్లోంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. గుక్కలనిండా పొగ పీల్చి వదులుతూ—

"ఇవన్నీ చిన్న చిన్న మలుపులు బ్రదర్. అసలైన మలుపు ముందుంది, రెండు కిలోమీటర్ల తరువాత, ప్రమాదకరమైన మలుపులే."

"అంత ప్రమాదకరమైన మలుపా?"

"చూస్తావుగా. కారాపి దూరంగా చూస్తే చాలు భయం పుడుతుంది. దానికి తోడు అక్కడే అడవిలాంటివచ్చటి ముసుగు. అవతల రోడ్డుందో లేదోనని అనుమానం కలుగుతుంది, ఆ చాటున బందిపోట్లు పొంచి వున్నారేమోనని సందేహం కలుగుతుంది."

"అలాగా?"

"అఫ్కోర్స్. యిదివరకటి మాటలే! అప్పట్లో రోజూ ఒకటి ... అంతకుమించి యాక్సిడెంట్లు ఖాయంగా జరిగేవి. చేతులు కాళ్ళు, ఒకోసారి శాల్తీలు గల్లంతు అయ్యేవి. గొప్ప మలుపులే."

"ఊఁ."

"అదేం మహిమో. ఆ మలుపులో ఒక దేవత వెలిసింది. అంతే ఎవరో మంత్రించినట్టు యాక్సిడెంట్లు ఆగిపోయాయి."

"అదెలా?"

"ఆవిడ మహాత్యం! ఆ దేవత గురించి చెబుతా విను."

"కానియ్."

"పేరు మఱపమ్మ. ట్రంక్ రోడ్డుపక్క పెద్ద రావి చెట్టు కింద తాటాకు గుళ్ళో వెలిసింది. ఆ గుళ్ళో పసుపు కుంకుమల గుట్ట కింద కట్టల కొద్దీ అగరొత్తుల పొగ మధ్య పసిపిల్ల సైజులో రాతి బొమ్మ ఆమె రూపం. ఆవిడ వెలిశాక ఒక ప్రమాదం జరిగితే ఒట్టు. నమ్ముతావా?"

"నమ్మకం విషయం తరవాత చెబుతా మరికొన్ని వివరాలు చెప్పు."

"ఆవిడ చాలా మహిమగల దేవత అని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఎన్నో చెప్పడం అనవసరం. ఆక్సిడెంట్లు ఆగడం ఒక్కటే చాలు నిదర్శనం."

"అక్కడ పూజా విధానం ఎలా వుంటుంది?"

"ఆవిడకి కోళ్ళు మహా ప్రీతి. పూజారి మనం సమర్పించిన కోడి పెట్టని కొబ్బరి కాయ కొట్టినంత సులభంగా మెడకొరికి— కొబ్బరినీళ్ళు చల్లినట్టు రక్తం దేవత మీద విసురుతాడు. భక్తులకి గుళ్ళలో కొబ్బరి చెక్కలు ఒకటి ఉంచుకుని ఒకటి ప్రసాదమిచ్చినట్టు కోడి పెట్టని కాళ్ళు పుచ్చుకుని రెండుగా చీల్చి-ఓ చట్ట ఉంచుకొని ఓ చట్ట మనకి యిస్తాడు. అదీ అక్కడి పద్ధతి. ఆ మాంసం అక్కడే తినెయ్యాలి. అక్కడ ఆచారం. మనకి కాల్చివేపి పెట్టే వాళ్ళు చిన్న చిన్న అంగళ్ళలో పొయ్యిలు పెట్టుకుని గుడి దగ్గర ఉంటారు."

"గమ్మత్తుగా ఉందే!"

"ఇక గుడి ముందు ప్రతి వాహనం ఆగాల్సిందే. చిన్నకార్లు లారీలు బస్సులు— ఎక్స్‌ప్రెస్ కాదు, దాని అబ్బా బస్సైనాసరే ఆగి తీరుతుంది."

"భయమేమో?"

"భయంకాదు. నమ్మకం. గుళ్ళోకెళ్ళే వాళ్ళు వెళ్తుంటారు. వెళ్ళనక్కర్లేకుండా - యిద్దరు పూజార్లు, అటొకడు యిటొకడు పళ్ళాల్లో జ్యోతులుంచుకుని...ఆగిన వాహనాల డ్రైవర్లకి ప్రయాణీకులకి కుంకుమ, పూలిచ్చి దక్షిణ స్వీకరిస్తారు. బస్సులోపలికి వెళ్ళి ప్రయాణీకుల ముందు పళ్ళెం తిప్పుతారు. చూడాలనుకున్నవాళ్ళు ఆగిదిగుతారు ముఖ్యంగా ఆవిడ లారీ వాళ్ళకి అత్యంత ప్రీతికరమైన దేవత."

సారధి చెబుతుండగానే మఱపు కను చూపు దూరంలో కనిపించింది. అర ఫర్లాంగు ముందు—'డేంజరస్ కర్వ్ ఎహెడ్' అనే ఆర్ అండ్ బీ వాళ్ళ హెచ్చరిక బోర్డుంది.

క్రమేపీ గుడి దగ్గరయింది.

పోత విగ్రహంలా ఒకడు చేతిలో పళ్ళెం ఉంచుకుని దారికడ్డంగా నిలబడ్డాడు. సారధి సౌంజ్ఞతో రఘు గుడిముందు కారాపాడు.

రఘు గుడిని కళ్ళు కెమేరాతో క్లిక్ చేశాడు. అచ్చం సారధి చెప్పిన వాతావరణమే అక్కడ నెలకొని వుంది.

బోర్లించిన శంకులా తాటాకు గుడి.

గుడి కొనమీద బంగారు చాయలో కలశం.

గుడి ముందు జనం కోలాహలం. అటు యిటు ఆగిన వాహనాలు, అరటిపళ్ళు, కొబ్బరి కాయలు, కోడిపెట్టలు, సారాయి అంగళ్ళు, పక్కన చిన్న కొలను. కొలను గట్టుమీద జుట్లు సమర్పించుకునేవాళ్ళు!

కార్లోవున్నా పసుపు కుంకుమ కర్పూరం కలిసిన గుడివాసన, కోళ్ళ కంపు, 'గవర్నమెంటు' ఘాటుతో కలబడి ముక్కులదర గొట్టింది.

పోత విగ్రహం రఘు ముందు పళ్ళెం చప్పుడు చేశాడు. పళ్ళెంలో కుప్పగాపోసిన నోట్లు చిల్లరమధ్య జ్యోతి వెలుగులో చిన్న పిండి ప్రతిమ వుంది. అతని వంక అదోలా చూసి చూపు సారధివైపు మళ్ళించాడు పోత విగ్రహం కారుచుట్టూ తిరిగి సారధి దగ్గరికి వెళ్ళాడు. అతను కుంకుమ నుదుటికీ ముక్కుకీ మధ్య జంక్షన్లో బొట్టు పెట్టుకుని పళ్ళెంలో రూపాయినోటుంచాడు. వాడు దేవత తనలో ప్రవేశించి దీవించినట్టు తల పంకించి కారు వదిలిపెట్టాడు.

రఘు కారు స్టార్టు చేశాడు. ఆ వాతావరణం దూరమైనా అతని ఆలోచనలు గుడి చుట్టూ గుమిగూడాయి. ఉండే కొద్దీ గుడి స్వరూపం ఎలా మారిపోతుందో ఆలోచించసాగాడు.

'రెండు మూడేళ్ళలో గుడి హుండీ బలిసి పిటపిటలాడిపోతుంది. ఈ తాటాకు గుడి స్థానంలో ఎత్తయిన గోపురం వెలుస్తుంది. పూజార్ల సఖ్య ఆశ్రితుల సంఖ్య పెరుగుతుంది. యాత్రికులు సరేసరి. చీమలపుట్టలు. ఏడాదికో రెండుసార్లు కళ్యాణాలో కక్కులో జరుపుతారు. రధాలు కదుపుతారు. ఆ వుత్సవాలకి లక్షలాది ప్రజలు పనీపాటా మానుకుని వచ్చి వూరేగుతారు...రవాణా సంస్థ ప్రత్యేకంగా బస్సులు నడుపుతుంది... యిలా.. దీనికి...అంతులేదు......''

''వాట్ డియర్ నేనంటే అస్తమానూ చూస్తుంటా గాబట్టి దిగలేదు. నువ్వు చూడలేదేం ?'' సారధి కదిపాడు.

''ఆసక్తిలేక. యిష్టంలేక'' అన్నాడు రఘు.

''నువ్వు దైవం లేదనే వాళ్ళలో ఒకడివని తెలుసు. కానీ బ్రదర్, దేవుడు లేడని ఎంత వాదించినా కొన్ని శక్తులు సమ్మక తప్పదు. అది రుజువైన నిజం.''

రఘు ఆగలేకపోయాడు. ''ఏది టా రుజువైన నిజం? మనం గుడ్డిగా నమ్మి ప్రచారం చేసి ప్రజలకి మూఢత్వం పంచుతున్నాం. ఉక్కు పిడుగుల్లాంటి పూజారుల్ని పెంచుతున్నాం. సోమరిపోతులకి, కాలం విలువ తెలియని వాళ్ళకి పీఠ యిస్తున్నాం. దైవం పేరుతో మరో దోపిడీ సంస్థని మహా వేగంగా పెంచుతున్నాం. వాళ్ళు పనీపాటా లేకుండా పెంచిన జుట్టుకి-అమ్మితే - బోలెడు విదేశీ మారకద్రవ్యం వస్తుంది.''

ఓ మైగాడ్ నీకింతా ఏం రుజువుకావాలి?''

''ఏ రుజువు ఉందని?''

''యాక్సిడెంట్లు కనికట్టులా ఆగిపోలేదా?''

యాక్సిడెంట్లు యాక్సిడెంట్లు అని గోల పెడతావేం? ఈ మలుపులో అటువైపు యిటువైపు వాహనాలు వేగంగా వెళ్తేనేకదా ప్రమాదాలు జరిగేది? యిక్కడో 'దేవత' ఉందని వాళ్ళు ఆగుతుంటే...పళ్ళాలు పుచ్చుకుని వీళ్ళు ఆపుతుంటే—ఎలా జరుగుతాయి ప్రమాదాలు ?''